

పైపులైన్ పనులకు భూమిపూజ చేసిన కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి

లోప్రెషర్ సమస్యకు పరిష్కారం

చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాలనీలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నదని కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శుభోదయకాలనీలోని రోడ్ నెం.5లో రూ.13.75లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ ఎక్స్‌టెన్షన్ నిర్మాణ పనులకు గురువారం కార్పొరేటర్ జల మండలి అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పైపులైన్ పనులు పూర్తి అయిన వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, బలం నాగేష్, బాలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి నాలాలో మురుగు కలవకుండా చర్యలు



వరదనీటి నాలాలో డ్రైనేజీ మురుగు, వ్యర్థ రసాయనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలాలో డ్రైనేజీ మురుగు, వ్యర్థ రసాయనాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్‌యార్డుకు సమీపంలో వరదనీటి నాలా గుండా వస్తున్న మురుగునీరు, వ్యర్థ రసాయనాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ తీవ్ర దుర్వాసన వస్తుండడంతో సమీప కాలనీల ప్రజలు, అటుగా రాకపోకలు సాగించే వారు అనారోగ్యం బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ, జలమండలి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులు, పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, నరేష్, శోభన్ బాబు, సంతోష్, మధు పాల్గొన్నారు.

శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లోని రామకృష్ణానగర్ కాలనీలో రూ. 30.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంగు రఘుగౌడ్, సద్గునరావు, దాసుగౌడ్, చంద్రయ్యగౌడ్, బొబ్బిలి శ్రీను, రాంరెడ్డి, మల్లయ్య, సైదాచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

కామినేనిలో ట్రామా వైద్య సేవలు

మన్సూరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలో వెయ్యికి పైగా ప్రమాద బాధితులకు వైద్య సేవలందించామని, తమ ఆస్పత్రిలో 24గంటల పాటు అత్యవసర ట్రామా వైద్య సేవలు అందించడం జరుగుతోందని కామినేని ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ప్రపంచ ట్రామా డేను పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆవరణలో గురువారం హఠాత్తుగా, స్వీయ తప్పిదాల వచ్చే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అనుకోని తగాదాల కారణంగా ట్రామా బాధితులు తీవ్రంగా పెరిగిపోతున్నారని అన్నారు. ప్రమాదాలకు గురైన వారికి తమ ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇందుకోసం ప్రత్యేక ట్రామా బృందం ఉందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ట్రామా వైద్యబృందం డాక్టర్ పైళ్ల నవీన్ రెడ్డి, డాక్టర్ శృంగల దేవీజన్, డాక్టర్ బి.కిషన్‌సింగ్ ఉన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్, కొత్తగూడెం గ్రామాలకు చెందిన 9మంది అయ్యప్ప స్వాములు పాదయాత్రగా శబరిమల యాత్రకు గురువారం బయలుదేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు గ్రామంలో మహాపడి పూజ నిర్వహించిన అనంతరం పాదయాత్రగా వెళ్లారు. 41 రోజుల్లో 1200 కిలో మీటర్ల దూరం వరకు స్వాములు పాదయాత్ర చేయనున్నారు. అనంతరం శబరీమలైలో అయ్యప్ప స్వామిని దర్శించుకోనున్నట్లు స్వాములు తెలిపారు. పాదయాత్రగా బయలుదేరిన స్వాములను బాటసింగారం మాజీ ఎంపీటీసీ బండిగారి విష్ణుగౌడ్ సన్మానించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంసీ యాదగిరి, మోహన్ రెడ్డి, హనుమంత్, వేణుచారి, సంజీవరెడ్డి, కోట ప్రభాకర్‌రెడ్డి, రవిచారి, శేఖర్ గుప్తా, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి

సంతోష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు ఆరోగ్యం విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ సూచించారు. మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుల బృందం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం పోలీసు సిబ్బందికి ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్, ఎస్ఐలు రవిగౌడ్, షేక్ వాజిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



హనుమాన్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి తదితరులు

'హనుమాన్ ఆలయ స్థలం కబ్జా కాకుండా కాపాడండి'

సరూర్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ కుర్మల్‌గూడలోని హనుమాన్ ఆలయ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణారెడ్డి కోరారు. గురువారం బీజేపీ నాయకులు, స్థానికులు హనుమాన్ ఆలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్ ఆక్రమణదారులతో కుమ్మక్కై మునిసిపల్ ఆస్తులను కాపాడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కుర్మల్‌గూడలోని 1025 గజాల స్థలానికి కబ్జాదారులు బైనంబర్లు వేసి, అక్రమ డాక్యుమెంట్లతో నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాలను అడ్డుకోకపోతే హిందూ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం ఇక్కడి హనుమాన్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ కేసరి విజయ భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు బాబు, ఎడ్ల శ్రీశైలం, అశోక్‌గౌడ్, శంకరయ్య, భాస్కర్, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవ్‌లతోనే..

95 శాతం రోడ్డు ప్రమాదాలు

- నగర్ ట్రాఫిక్ డీసీపీ-3 వెంకటేశ్వర్లు
- ముసారాంబాగ్ చౌరస్తాలో ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్



ముసారాంబాగ్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న నగర ట్రాఫిక్ డీసీపీ-3 వెంకటేశ్వర్లు

చాదర్‌ఘాట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్ల పరిధుల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 95 శాతం ప్రమాదాలు డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవ్‌ల ద్వారానే జరుగుతున్నాయని నగర ట్రాఫిక్ డీసీపీ-3 ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ముసారాంబాగ్ చౌరస్తాలో నిర్వహించిన ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలా మంది ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనాదారులు, కార్ల డ్రైవర్లు రీల్స్, సినిమాలు చూస్తూ వాహనాలు నడుపుతున్నట్లుగా ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించినట్లు తెలిపారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడితే ఆయా వాహనదారునిపై సెక్షన్ 184 ఎంవీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. ఆయా వాహనాన్ని కూడా సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. 2025 జనవరి నుంచి అక్టోబరు 15వ తేదీ నాటికి 1,760 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా వీరిలో 51 మంది వాహనాదారులకు ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్షతోపాటు జరిమానాలు విధించినట్లు డీసీపీ తెలిపారు. 110 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడగా మైనర్లతోపాటు వారి తండ్రిని కూడా కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనం నడుపుతూ 1,48,297 మంది, 48,125 మంది వాహనాదారులు రాంగ్ సైడ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డారని తెలిపారు. సెల్‌ఫోన్ డ్రైవ్ చేస్తూ 3,592 మంది వాహనాదారులు పట్టుబడ్డారని తెలిపారు. ముసారాంబాగ్ చౌరస్తాలో అరగంట పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో సెల్‌ఫోన్ డ్రైవ్ చేస్తున్న 20 మంది వాహనాదారులు పట్టుబడ్డారని డీసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ రామదాసు తేజావత్, సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ వి.చంద్రకుమార్, మలకపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.అశోక్‌కుమార్‌తో పాటు పలువురు సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రచారం



మార్నింగ్‌వాక్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ , అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువారం ఉదయం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వెంగళరావునగర్ పార్కులో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కార్పొరేటర్ దేదీప్యరావుతో కలిసి మార్నింగ్‌వాక్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో బీరప్ప ఆలయానికి శంకుస్థాపన

చాదర్‌ఘాట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్‌లో శ్రీ బీరప్ప ఆలయం నిర్మాణానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, బీరప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు చిగుర్ల ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బైర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అంజదుల్లాఖాన్

వక్ఫ్‌బోర్డు సీఈవోను ఎందుకు తొలగించారు.. తిరిగి ఎందుకు నియమించారు.?

- ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్

చాదర్‌ఘాట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోగా అసద్ ఉల్లాను 3నెలల క్రితం ఎందుకు తొలగించారో?, తాజాగా తిరిగి ఎందుకు నియమించారో? సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ డిమాండ్ చేశారు. గురువారం చంచల్‌గూడలోని ఎంబీటీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఈవో అసద్ ఉల్లాను తొలగించిన కారణంగా వక్ఫ్ బోర్డు మూడు నెలలుగా పనిచేయలేదని అన్నారు. సీఎం భూ కబ్జాదారుల మాఫియాతో కుమ్మక్కై నిజాయితీ గల అధికారి అసద్ ఉల్లాను తొలగించారని ఆరోపించారు. తద్వారా వక్ఫ్ ఆస్తులను సులభంగా లాక్కోవచ్చన్న కుట్ర జరుగుతుందని ఆయన ఆరోపించారు.

రష్యాలో చిక్కుకున్న అహ్మద్‌ను భారత్‌కు తీసుకురండి

- విదేశాంగ వ్యవహారాల శాఖామంత్రికి ఎంబీటీ అధికార ప్రతినిధి విజ్ఞప్తి



రష్యాలో ఉన్న మహ్మద్ అహ్మద్

చాదర్‌ఘాట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ముంబై ఏజెంట్ చేతిలో మోసపోయి, ఉద్యోగం కోసం రష్యాకు వెళ్లి చిక్కుకున్న నగరంలోని ఎంఎస్ మక్తా నివాసి మహ్మద్ అహ్మద్‌ను తిరిగి స్వదేశానికి సురక్షితంగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విదేశాంగ వ్యవహారాల శాఖా మంత్రి జైశంకర్‌కు ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ట్విట్టర్, ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. గురువారం ఎంఎస్ మక్తాలోని అహ్మద్ ఇంటికి అంజదుల్లాఖాన్ వెళ్లి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యాలో చిక్కుకున్న అహ్మద్‌కు పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధురాలైన తల్లి, భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, ఆ కుటుంబానికి అహ్మదే జీవనాధారమని తెలిపారు. ట్రస్ట్ కన్సల్టెన్సీ రష్యాలో నిర్మాణ సంస్థలో పనిచేయడానికి మహ్మద్ అహ్మద్‌కు ఆఫర్ ఇవ్వగా దాన్ని నమ్మి గత ఏప్రిల్ 25న రష్యాకు చేరుకున్నాడని ఆయన వివరించారు. నెల తర్వాత మహ్మద్ అహ్మద్‌తోపాటు మరో 30 మందిని మారుమూల ప్రాంతానికి తరలించి బలవంతంగా ఆయుధ శిక్షణ ఇచ్చి, ఉక్రెయిన్ సైన్యంతో పోరాడటానికి సరిహద్దు ప్రాంతానికి తీసుకెళ్లినట్లు అహ్మద్ పంపిన వీడియోలో వివరించాడని ఆయన పేర్కొన్నారు.

ఓఆర్ఆర్‌పై ట్రాలీ ఆటోను ఢీకొన్న బొలేరో

- ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ వద్ద ఔటర్ రింగు రోడ్డుపై ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన ఆలీకి బోర్‌వెల్ వాహనం ఉంది. దానిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మఢ్కం దేవాతో పాటు ముక్తా, భీమా కార్మికులుగా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి 8గంటల సమయంలో పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు మీదుగా బోర్‌వెల్ వాహనం జల్‌పల్లికి వెళ్తుంది. టోల్‌ప్లాజా దాటిన కొద్ది దూరంలో బోర్‌వెల్ వాహనం టైరు పంక్చర్ అయ్యింది. ఈ విషయాన్ని వాహన సూపర్‌వైజర్ అయిన సయ్యద్ ఫజల్‌కు సమాచారం అందించారు. దీంతో అతడు ఓ ట్రాలీ ఆటోలో మరో టైరును తీసుకువచ్చి బోర్‌వెల్ వాహనం వెనుక ఆటోను ఆపాడు. అదే సమయంలో ఘట్‌కేసర్ వైపు నుంచి శంషాబాద్ వైపునకు వస్తున్న బొలేరో వాహనం ఆటో ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోర్‌వెల్‌పై కార్మికుడిగా పని చేస్తున్న దేవా తలకు బలమైనా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యాకత్‌పురాకు చెందిన సూపర్‌వైజర్లు సయ్యద్ ఫజల్, సయ్యద్ ముజ్తాబాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైనా చికిత్స కోసం ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ తేనె విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కల్తీ తేనె విక్రయిస్తున్న ముగ్గురిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాఫీజ్‌బాబానగర్‌లో గురువారం సాయంత్రం కల్తీ తేనె విక్రయిస్తున్న హస్తినాపురం డివిజన్ నందనవనంలో నివాసం ఉంటున్న బిహార్‌కు చెందిన క్రాంతిమండల్(32), అర్జున్‌మండల్(26), ప్రదీప్‌మండల్(22)ను అదుపులోకి తీసుకొని, ఓమ్నీ వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ తేనె విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు. ఓమ్నీ వ్యాన్‌లో సుమారు వంద కిలోల బెల్లం, చెరుకు రసంతో తయారు చేసిన తేనెను విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని, బాటిల్ తేనెను వారు 9వందలకు విక్రయిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సెంట్రింగ్ పనులు చేస్తూ కిందపడి కార్మికుడు మృతి

చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి కార్మికుడు మృతిచెందాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్ బిస్మిల్లా హోటల్ సమీపంలో ఓ ఇంటి మొదటి అంతస్తు నిర్మాణంలో సెంట్రింగ్ పనులు నిర్వహిస్తుండగా గురువారం ఉదయం రక్షాపురంకు చెందిన కె.శంకర్(30) ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతని తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శంకర్ మృతిచెందాడు. మృతుని స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా కాగా, మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణకాంత్ తెలిపారు.

కల్వర్టు మూసుకుపోయి.. రోడ్డుపైకి డ్రైనేజీ మురుగు

కుంట్లూర్ 20వ వార్డులో దుర్వాసన



రోడ్డుపై చేరి మడుగును తలపిస్తున్న మురుగు నీరు

అబ్దుల్లాపూర్‌మెట్ అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ 20వ వార్డులో కల్వర్టు మూసుకుపోవడంతో డ్రైనేజీ మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ రోడ్డు చిన్న మడుగును తలపిస్తోంది. మురుగు నుంచి వస్తున్న దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు తెలిపారు. రోడ్డుపై మురుగు నీరు నిలుస్తుండడంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. 20, 21వ వార్డులకు చెందిన మురుగు మ్యాన్‌హోల్‌ల ద్వారా కల్వర్టు వద్దకు చేరుతుంది. కొంత కాలంగా కల్వర్టు రంధ్రం మూసుకుపోయింది. దాంతో మురుగు బయటకు వెళ్లలేక నేరుగా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. ఆ ప్రాంతంలో దుర్వాసనతో ముక్కు మూసకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు బెడద కూడా ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు విజృంబిస్తున్న ఈ సమయంలో శానిటేషన్ నిర్వహణపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తగదని స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొత్తపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు తెలిపారు. గురువారం ఎల్బీనగర్, కొత్తపేట, నాగోల్, కూడళ్లలో వారు ట్రాఫిక్ నిబంధనలపై 21 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

57 మంది మందుబాబులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్ఐ ఎస్పీఓ అల్లూరయ్య సూచించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో 57 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్‌హాల్‌లో 5 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం కోసం సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలను ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్ ప్రదర్శించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్

సంతోష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. గురువారం చంపాపేటలో జరిపిన తనిఖీలలో 12మంది మందుబాబులను గుర్తించి కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు వెంకటప్ప, జనార్దన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ సంఘాల నేతలు

బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేపట్టాలి

చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. హస్తినాపురం చౌరస్తాలో గురువారం పలు బీసీ సంఘాల నేతలతో కలిసి శ్రీనివాసులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న నిర్వహించనున్న బీసీ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీస్ అధ్యక్షుడు పెంజర రమేష్, బీసీ జేఏసీ కన్వీనర్ ఏ.సాయికుమార్ నాయకులు మెదిగొండ ఎల్లేష్, దుబ్బ ఆంజనేయులు, నవీన్ కుమార్, బ్రహ్మయ్య, రామకృష్ణ, సుజాత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం మరోసారి సీజ్

సైదాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ సెల్లారు నిర్మాణ పనులను మరోసారి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో ఓ బిల్డర్ కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా సెల్లార్ నిర్మాణం చేపట్టడంతో కాలనీవాసులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జూలై 1న సంతోష్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. పది రోజుల క్రితం సీజ్ చేసి తాళాలు తీసివేసి బిల్డర్ నిర్మాణం తిరిగి ప్రారంభించారు. మరోసారి స్థానికులు ఫిర్యాదు చేయగా అధికారులు తిరిగి నిర్మాణాన్ని సీజ్ చేశారు.

కుర్మల్‌గూడలో చెత్త వాహనాల అడ్డగింత

సరూర్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి చెత్తను తరలిస్తున్న వాహనాలను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. చెత్త వాహనాల కారణంగా రాగన్నగూడ, కుర్మల్‌గూడ గ్రామాలు కాలుష్యం బారిన పడుతున్నాయని, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పేరుతో ఇక్కడ డంపింగ్ యార్డు తయారు చేశారని ఈ సందర్భంగా స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమ ప్రాంతానికి చెత్త తరలింపును నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

టీఎండబ్ల్యూఈయూ ఉపాధ్యక్షుడిగా కిషన్



కిషన్

హయత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుర్కయంజాల్‌కు చెందిన డి.కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాగన్నగూడలో జరిగిన ప్రతినిధుల సభలో కిషన్‌ను ఎనుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు సహకరించిన నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● ఉత్తమ ఉపాధ్యాయుడికి అవార్డు



లీడ్ ఇండియా ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ లోటస్‌ల్యాప్ పాఠశాలకు చెందిన టీచర్ రవీందర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ప్రదానం చేస్తున్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ సుదర్శన్ ఆచార్య, ఎస్ఎస్‌రెడ్డి

– చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి)

శుభాకాంక్షలు



రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్.

-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి